క్లుప్తంగా

గుణాత్మక విద్యను బోధించాలి

కుప్పంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని ఎం ఈవో –2 రాజారాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తూరు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సులభ రీతిన అర్థమయ్యేలా బోధన సాగాలని తెలిపారు.

రూ. 20 లక్షలతో బోర్లు, పైప్‌లైన్లు



పుంగనూరు: మున్సిపల్ పరిధిలో రూ.20లక్షలతో బోర్లు, పైపులైన్ల కార్యక్రమం చేపట్టినట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ, మేలుపట్ల ప్రాంతాల్లో బోర్లు, పైపులైన్లు వేసే కార్యక్రమం చేపట్టారు. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు విస్తర్ణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు వేసి పైపులైన్లు వేస్తున్నామన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, డీఈఈ మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ లలిత, కౌన్సిలర్ భారతి పాల్గొన్నారు.

కౌలుదారు పత్రాల పంపిణీ

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయశాఖ పరిధిలోని ఆరు మండలాల రైతులకు కౌలుదారు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు డివిజన్ పరిధిలో 502 మందికి కౌలుదారు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. భూ యాజమానుల హక్కులకు భంగం కలగకుండ 9 నెలల కాల పరిమితితో కౌలురైతు సర్టిఫికెట్లను అందజేస్తున్నామన్నారు. కౌలు రైతులు సచివాలయాలలో నమోదు చేసుకుని ధ్రువపత్రాలు పొందాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

వి.కోట: మహిళలు స్వయం ఉపాధిని పొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని పత్రపల్లె సచివాలయ పరిధిలోని అమూల్ పాల సేకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మహిళాపాడి రైతులతో సమావేశమయ్యారు. ఆర్డీఓ శివయ్య, ఎంపీపీ యువరాజు, మండలాధికారులు పాల్గొన్నారు.

నేడు గుడివంక అంగళ్లు వేలం

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాల అంగళ్లు గేటు వేలం బుధవారం నిర్వహిస్తున్నటు దేవస్థానం చైర్మన్ సుబ్రమణ్యం, ఈవో చలపతి తెలిపారు. అంగళ్లు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం జరిగే వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

డబ్బు ఇవ్వలేదని గెంటి వేత

సోమల: పెన్షన్ డబ్బులు ఇవ్వలేదని తన మనవరాలు కొట్టి ఇంటిలో నుంచి గెంటి వేసిందని మొగిలమ్మ (67) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దేవరాజులు మంగళవారం తెలిపారు. గాయపడిన మొగిలమ్మను పుంగనూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరాజులు తెలిపారు.

25న బ్రాహ్మణ సంఘం సమావేశం

పుంగనూరు: ఈనెల 25, 26 తేదీల్లో శ్రీనివాస మంగాపురంలో బ్రాహ్మణ సంఘం సమావేశం జరుగుతుందని పురోహిత్ సంఘ జిల్లా గౌరవ సలహాదారు రామమూర్తి తెలిపారు. పురోహితుల సమస్యల పరిష్కారం కోసం చర్చ ఉంటుందన్నారు. అలాగే పురోహిత్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఇళ్ల పట్టాలకు 9 ఎకరాల కొనుగోలు

రొంపిచెర్ల: పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కోసం రూ.30.65 లక్షలతో 9 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. మంగళవారం రొంపిచెర్లలో జగనన్న కాలనీకి చదును చేస్తున్న భూమిని పరిశీలించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

రొంపిచెర్ల: రాయితీపై రాగి విత్తనాలు పంపిణీ చేసినట్లు పుంగనూరు డివిజన్ వ్యవసాయ సహాయ సహయకుడు శివకుమార్ తెలిపారు. మంగళవారం రొంపిచెర్ల సచివాలయంలో సబ్సిడీ రాగి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి సుధారాణి, రైతు భరోస కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

వి.కోట: హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ ఆశీర్వాదం హెచ్చరించారు. మంగళవారం మండలం కేంద్రంలో అంబేడ్కర్ సర్కిల్‌వద్ద సీఐ, పోలీస్ సిబ్బంది వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మనోహర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం ఆడి మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు.

పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు

ప్రజా సేవా లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్ల వ్యవస్థ ఉగ్ర రూపం దాల్చింది. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించబోవమని హెచ్చరికలు జారీ చేసింది. ఏలూరులో పవన్ చేసిన వ్యాఖ్యల నిరసిస్తు పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో వలంటీర్లు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. పవన్ క్షమాపణలను చెప్పాలని డిమాండ్ చేస్తున్ దిష్టి బొమ్మలను చెప్పులతో కొడుతూ ర్యాలీ నిర్వహించి, దహనం చేశారు.

కుప్పం, రామకుప్పం: కుప్పం మున్సిపాలిటీ, రామకుప్పం మండలాల్లో పవన్ వ్యాఖ్యలపై వలంటీర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కుప్పంలో రైల్వే గేటు వద్ద నుంచి బస్టాండ్ వరకు పవన్ డౌన్ డౌన్, పవన్‌ను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. వలంటీర్లకు క్షమాపణ చేప్పాలని లేదంటే వారాహి యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నిరసనలు చంద్రబాబు నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తామని హెచ్చరించారు. పార్టీ పెట్టి పదేళ్లు పూర్తి చేసుకుంటున్నా ప్రజా క్షేత్రంలో అభిమానం పొంద లేక పోయావ్వు...కేవలం ప్యాకేజీ డబ్బుల కోసం బాబుకు మద్దతు ఇచ్చేలా ప్రవర్తిస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ వద్ద పవన్ కల్యాణ దిష్టిబొమ్మను మహిళా వలంటీర్లు చెప్పులతో కొట్టి దగ్ధం చేశారు.

అరెస్టు చేయాలని ఫిర్యాదు

వలంటీర్లపై పవన్ కల్యాణ చేసిన వ్యాఖ్యలపై రామకుప్పంలో వలంటీర్లు నిరసన చేపట్టారు. దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. పవన్‌ను అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు తెలుసు

రొంపిచెర్ల: ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లను దూషిస్తే ఊరుకునేది లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను వలంటీర్లు హెచ్చరించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం రొంపిచెర్లలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ మూడు పెళ్లిళ్లు చేసుకుని, ముగ్గురికీ విడాకులు ఇచ్చిన పవన్‌కు వలంటీర్ల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. వలంటీర్లు చేసిన సేవలు ప్రజలకు తెలుసన్నారు.



కుప్పంలో వలంటీర్ల నిరసన



సోమల: నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



పెద్దపంజాణి : పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

దిష్టిబొమ్మ ఊరేగింపు

గంగవరం: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గంగవరం సచివాలయ పరిధిలోని వలంటీర్లు మంగళవారం నిరసన చేపట్టారు. పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

సోమల: వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి పవన్ కల్యాణ్ చిత్ర పటాన్ని చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఎంతో నమ్మకంతో ప్రజాసేవ చేసే అవకాశం ఇచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను ఎంతో మందికి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నామని తెలిపారు.

పవన్ క్షమాపణ చెప్పాలి

పెద్దపంజాణి: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ డిమాండు చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి ఎమ్మెల్యే వెంకటేగౌడ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ తెలంగాణలో ఉంటున్నారు కాబట్టి మా వలంటీర్లపై మీకు చిత్తశుద్ధిలేదు. మీరు ఇక్కడ కాపురముంటే మా వలంటీర్ల ద్వారా మీకు ఎన్నిసేవలు అందేవో మీకు తెలిసేది. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు అనేక సేవలందించారు. రాజకీయ అవగాహన లేక చంద్రబాబు చేతిలో కీలు బొమ్మలా తయారై మాట్లాడుతున్నారు' అని ఎద్దేవా చేశారు. సేవా భావంతో పని చేస్తున్న వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హితవుపలికారు. వలంటీర్లపై చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లంటే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉందని తెలిపారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

చీపురుతో కొడుతూ నిరసన

చౌడేపల్లె: అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండు చేశారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ చౌడేపల్లెలో పవన్ దిష్టి బొమ్మను ఊరేగిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. చెప్పుల హారం వేసి చీపుర్లతో కొడుతూ ర్యాలీ నిర్వహించారు. కరోనా, వరదలు, విపత్కర సమయాల్లో వలంటీర్ల ధైర్య సాహసాలను గుర్తించిన పొరుగు రాష్ట్రాలు అభినందిస్తుంటే పవన్ విమర్శించడం తగదన్నారు. ఎంపీపీ రామమూర్తి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచ్‌లు వరుణ్ భరత్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కుప్పం: పవన్ దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న వలంటీర్



రొంపిచెర్లలో వలంటీర్ల నిరసన ర్యాలీ



పుంగనూరులో దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న వలంటీర్లు



చౌడేపల్లె : దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న వలంటీర్

దేశానికే ఆదర్శంగా పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దారికుంట, చిన్నారికుంట, గురివిరెడ్డిపల్లె, ఆంజనేయపురం, బసాపురం, పిల్లిగుండ్లపల్లె, చిల్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రజలను దోపిడీ చేయడం, దోచింది పచ్చనేతలకు పంచి పెట్టడం తప్ప సామాన్యులకు చేసిందేమీ లేదన్నారు. పథకాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ప్రజల ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. మేనిఫెస్టోలోని ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పృథ్వి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, సుహేబ్, ఏఎంసీ డైరెక్టర్‌లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, స్థానిక సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ గురుమూర్తి పాల్గొన్నారు.

గంగవరం: ప్రజల శ్రేయస్సు కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం మండలంలోని దండపల్లె, కల్లుపల్లె సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లుపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చిన్న సర్టిఫికెట్ పొందాలన్నా మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వైస్ ఎంపీపీ ఉమాదేవి, సచివాలయాల మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం హేయం

కుప్పంరూరల్: మండల పరిధిలోని మల్లానూరులో అభివృద్ధి పనులను అడ్డుకోవడం టీడీపీ నాయకులకు తగదని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం మల్లానూరులో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా మల్లానూరు గ్రామం అభివృద్ధి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చొరవ తీసుకుని అభివృద్ధి పనులను చేపడితే అడ్డుకోవడం తగదన్నారు. పనులకు సహకరించక పోగా, పనులు చేపడుతున్న వారిపై దాడులకు దిగడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గ్రామంలో ఒక బస్సురోడ్డుపైకి వస్తే మిగిలిన వాహనాలు తప్పుకుని పోయేందుకు వీలు కాదని, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి రోడ్డును వెడల్పు చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ప్రజలను మభ్యపెడుతూ వచ్చారని, ఎక్కడ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందోనని పనులను అడ్డుకోవడం, దాడులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా పనులను ఆపేది లేదని, మల్లానూరు చెరువు ప్రారంభం నుంచి పెట్రోల్ బంకు వరకు రోడ్డును వెడల్పు చేసి తీరుతామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణ దారులే స్వచ్ఛందంగా వచ్చి సహకరిస్తుంటే టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేస్తున్నారని అన్నారు.

వేగంగా పనులు

మల్లానూరు ప్రారంభం నుంచి పెట్రోల్ బంకు వరకు రోడ్డు వెడల్పు పనులను అధికారులు, నాయకులు సమన్వయంగా వేగంగా చేపడుతున్నారు. సోమ, మంగళవారాల్లో పనులు చేపట్టారు. సోమవారం చెరువు కట్ట వద్ద పనులు చేపడుతుంటే కొంత మంది టీడీపీ మద్దతుదారులు వైసీపీ నాయకుడు శీనుపై దాడికి పాల్పడ్డారు. అట్రాసిటీ కేసులు పెడతామని భయాందోళనకు గురి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయినప్పటికీ ఎక్కడ వెరవకుండా పనులను చేపడుతున్నారు.



మల్లనూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

సమష్టి కృషితో ఆదర్శ మండలంగా కుప్పం

కుప్పంరూరల్ : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి కుప్పం మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం కుప్పం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అశ్విని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అందజేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. విద్యాకానుక, వసతి దీవెన, వంటి పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని తెలిపారు.

త్వరలో ప్రారంభోత్సవాలు

ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ మాట్లాడుతూ, త్వరలో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మూడు రోజుల పర్యటన కుప్పంలో ఉంటుందని, పూర్తయిన నిర్మాణాలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. నాడు– నేడు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల నుంచి సభ దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలపై స్పందించిన ఎంపీ రెడ్డెప్ప తనకు ఒక నివేదిక ఇస్తే కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ సుశీలషౌకత్, టౌన్‌బ్యాంకు చైర్మన్ భాగ్యరాజ్, ఎంపీడీవో జానకమ్మ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

కుప్పం: ఉచిత సేవలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టారని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. సోమవారం కుప్పం మున్సిపాలిటి పరిధిలోని 10, 11,12 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఎంపీ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాలు అందకుంటే ఉంటే జగనన్న సురక్షలో పొందవచ్చని తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా పంపీణీ చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు తమకు కేటాయించినా 50 ఇళ్లలో సర్టిఫికెట్లు సమస్యలు ఉంటే వెంటనే సురక్ష ద్వారా పరిష్కారమయ్యే విధంగా చూడాలని పేర్కొన్నారు. 10,11,12 వార్డుల్లో 503 సర్టిఫికెట్లు జగనన్న సురక్ష కింద పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కమిషనర్ నరసింహ ప్రసాద్, కౌన్సిలర్లు మాధవి మోహన్, మమత విజయ్ పాల్గొన్నారు.

అందరికీ ఉచిత సేవలు

సోమల: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం నంజంపేట సచివాలయ పరిధిలో సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహమ్మదాలీ జిన్నా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం జరిగింది. లబ్ధిదారులకు 190 సర్టిఫికెట్లను ఎంపీపీ పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వర రావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఈఓపీఆర్డీ సుధాకర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సబితమ్మ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రొంపిచెర్ల: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం చిచ్చిలివారిపల్లె సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 416 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, తహశీల్దార్ అమరనాథ్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మ, మార్కెట్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే సురక్ష

పుంగనూరు: ప్రతి కుటుంబంలోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఏతూరులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో నారాయణ, తహసీల్దార్ సీతారామన్ నిర్వహించారు. అతిథులుగా ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి హాజరైయ్యారు. ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పుంగనూరులో జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించి ఆదర్శంగా ఉండేలా పని చేస్తున్నామన్నారు. మండల సచివాలయల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి , ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, పెంచుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సురక్షపై అవగాహన

పులిచెర్ల(కల్లూరు) : ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకమని ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ తెలిపారు. మండలంలోని దిగువపోకలవారిపల్లె, దేవళంపేట సచివాలయ పరిదిలో జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించారు. దిగువపోకలవారిపల్లెలో అర్హులకు సర్టిఫికెట్లను అందజేశారు.

సమస్యల పరిష్కార వేదిక సురక్ష

పలమనేరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష కార్యక్రమమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చాన్మాకమాల్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఆర్‌కే వీధి సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 264 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కమిషనర్ కిరణ్‌కుమార్, ఈవోఆర్డీ గిరిధర్, సర్పంచ్ హంసవేణి, నాయకులు రంగనాథం, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

పెద్దపంజాణి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చామనేరు, చలమంగళంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ లోకేశ్వరరావు, డీటీ రమేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సదుం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప కోరారు. బూరగమంద సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దారు చంద్రశేఖర్, సర్పంచ్‌లు జగన్నాథం, వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



కుప్పం: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ సుధీర్



పుంగనూరు : ఏతూరులో ధ్రువపత్రాల అందజేత

వలంటీర్‌కు అభినందన



పలమనేరు : జగనన్న సురక్షలో భాగంగా అందిన అర్జీ కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఈకేవైసీ చేసుకొచ్చిన పెద్దపంజాణి మండలం గౌరీనగర్‌కు చెందిన వలంటీర్ వాసును ఎమ్మెల్యే వెంకటేగౌడ అభినందించారు. మంగళవారం మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో వలంటీర్‌ను శాలువా కప్పి సన్మానించారు. బైరెడ్డిపల్లె మండలం ధర్మపురికి చెందిన విజయకుమార్ రేషన్ కార్డులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతని అన్న హరినారాయణ కుటుంబీకుల పేర్లను స్లిప్ట్ చేసేందుకు వలంటీర్ హైదరాబాద్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

పరిశుభ్రత పాటించాలి

బైరెడ్డిపల్లె: పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. మండలంలోని తీర్థం గ్రామంలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని, ఉపాధి హామీ పథకం కింద పాఠశాల స్థలాన్ని అభివృద్ధి చేసి మొక్కలను పెంచాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన స్థలం దాతలు అందజేశారని, ఆటస్థలం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం పీహెచ్‌సీని, జగనన్న లేఅవుట్‌లోని గృహాలను పరిశీలించారు. ఎమ్మెల్సీ భరత్, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆదర్శ ఉద్యోగులను అభినందించారు. డీఎం సుధాకరయ్య మాట్లాడుతూ చలపతి, రామనాథ్, ఎంబీరెడ్డి, శంకరయ్య, భక్తవత్సలం విధి నిర్వహణలో ఇంధనం పొదుపు చేయడంలో రికార్డు సృష్టించారన్నారు. వీరికి నగదు బహుమతులు ఇచ్చి ప్రశంసించారు. అసిస్టెంట్ మేనేజర్ సంధ్య, సూపర్‌వైజర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిరస్సు ఊరేగింపు



రామకుప్పం: మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి శ్రీగంగమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. మంగళవారం శిరస్సు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. విశిష్ట అలంకరణ అనంతరం దర్శనభాగ్యం కల్పించారు. శిరస్సు ఊరేగింపు రామకుప్పం పురవీధుల్లో కొనసాగింది. భక్తులు అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం ఉత్సవం వేడుకగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.